క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

వీరవాసరం: మండలంలోని రాయకుదురు శివారు వీరవల్లి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి పూర్వక హనుమత్ సీతారామ లక్ష్మణ స్వామి వార్ల ఆలయ పునఃనిర్మాణ శిలా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాసన, ప్రతిష్ఠ హోమములు, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ సీతారామ స్వామి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బాలౌ సుధీర్, మోహిని దంపతులచే శ్రీ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు , భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మెరుగుపడిన మంచినీటి సరఫరా



13వార్డు, సంతపేట ప్రాంతాల్లో మెరుగుపడిన మంచినీటి సరఫరా

ఆకివీడు: పైప్‌లైన్లలోకి డ్రెయినేజీ నీరు రావడంతో స్థానిక 13వ వార్డు, సంతపేట ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అయిందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. విషయం తెలుసుకుని నగర పంచాయతీ వాటర్‌వర్క్స్ ఏఈ, సిబ్బందిని హుటాహుటిన ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్లను పరిశీలించగా రెండు ప్రాంతాల్లో పైప్ పాడైపోవడంతో కలుషిత నీరు చేరిందని తెలిసిందన్నారు. వెంటనే ఆయాప్రాంతాల్లోని పైపులకు మరమ్మ తులు చేయించి ఫిల్టర్ చేసిన నీటిని వదలడంతో సమస్య పరిష్కారం అయిందని చెప్పారు. శుక్రవారం పైపులద్వారా ఫిల్టర్ అయి న నీటిని విడుదల చేయించామని చెప్పారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల్ని కాపాడుకుంటాం!



స్థానిక అయిభీమవరం రోడ్డులోని ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఆకివీడు: సీబీసీఎన్‌సీకి చెందిన ఆస్తుల్ని రక్షించుకుంటామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రెవ. డాక్టర్ ఎం. విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక అయిభీమవరం రోడ్డు వైపు, పెదపేటకు చేర్చి ఉన్న స్థలాల్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిస్టియన్ సంస్థలకు చెందిన అన్ని ఆస్తులకు సంబంధించి తమ వద్ద రికార్డులున్నాయన్నారు. బ్రిటీష్ కాలంలోనే 1820 ప్రాంతంలో తమ సంస్థకు దస్తావేజులతో కూడిన ఆస్తుల్ని ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి పాస్టర్, సీబీసీఎన్‌సీ రాష్ట్ర నాయకుడు గూడపాటి జోసఫ్‌రాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాలిక ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, ప్రశాంత్

భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని అల్లూరి శ్రీరామరాజు కల్యాణ మండలంలో శుక్రవారం 18 నెలల బాలిక హప్సాకు బ్రెయిన్ ఆపరేషన్‌కోసం దాతల సహకారంతో రూ.20 వేలు ఎమ్మెల్యే అంజిబాబు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పులపర్తి ప్రశాంత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమవరపు పెద్దిరాజు, అలీషా, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలి

పెనుగొండ : ఉగ్రవాదం మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మత సామర స్య దేశ సమగ్రత పరిరక్షణకు సీపీఎం చేపట్టిన సమైక్యత యాత్ర శుక్రవారం ఆచంటలో నిర్వహించారు. రామేశ్వర స్వామి సత్రం నుంచి కచేరీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని చెప్పారు. ఉగ్రవాదులను అంతమొందించామని తెలిపారు.

మళ్లీ వానా కాలం చదువులొచ్చాయ్

- భ్రష్టు పడుతోన్న విద్యా వ్యవస్థ
- ఏడాదిలో చతికిలబడిన చదువులు
- నాటి జగన్ పాలన చదువులే నేటి రికార్డులు



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తి నిర్మాణంలో అదనపు తరగతి గదులు

ఆకివీడు: మళ్లీ వానా కాలం చదువులొచ్చాయని తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక విద్యకు, విద్యా బోధనకు విద్యార్థులు దూరమైపోతున్నారు. వ్యవస్థల్ని జగన్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని చెప్పుకువచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవస్థల్ని కూనీ చేస్తుందని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానా కాలం చదువులకు స్వస్తి చెప్పి ఆధునిక విద్యా వ్యవస్థను ఐదేళ్లా అమలు జేసిన జగన్ పాలనలో విద్యార్థులు తమ మేథస్సుకు పదును పెట్టి విద్యలో పోటీ పడ్డారు. అంతర్జాతీయ స్థాయి విద్యనందుకుంటున్నారు. డిజిటల్‌బోధన, బైజూస్ ట్యాబ్‌లతో విద్యార్థుల్లో చదువుల పట్ల ఆసక్తి పెరిగింది. 8, 9, 10 తరగతి విద్యార్థులు ఆధునిక విద్యా బోధనతో మంచి ఫలితాల్ని పొందుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి విద్య రంగాన్ని వెనక్కి తీసుకు వెళ్తుతోందని ఆరోపిస్తున్నారు.

నాడు కార్పొరేట్‌ను తలదన్నిన సర్కారు స్కూళ్లు

నియోజకవర్గంలో స్కూళ్లు	
ఆకివీడు	58
కాళ్ల	60
పాలకోడేరు	55
ఉండి	61

కార్పొరేట్ విద్యావ్యవస్థను తలదన్నే విధంగా జగన్ పాలనలో సర్కారు బడులు అభివృద్ధి చెందాయి. నాడు-నేడులో నియోజకవర్గంలోని పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు నూతన శోభను సంతరించుకున్నాయి. పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం, ట్యాబ్‌లలో, ఐఎఫ్‌బీ ఫ్యానెల్స్ ద్వారా విద్యా బోధన జరిగింది. ఆహ్లాదకరమైన బల్లలు, టేబుళ్లతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ఫ్యాన్లు, లైట్ల మధ్య విద్యా బోధన జరిగింది. విద్యార్థులకు టై,బెల్టు,షూ, యూనీఫాంలు అందజేశారు. ఆరోగ్యకరమైన గోరుముద్ద,విశాలమైన క్రీడా ప్రాంగణంలో అన్ని క్రీడలకు సంబంధించిన పరికరాల్ని అందుబాటులో ఉంచారు. పేదలకు విదేశీ ఉన్నత విద్య చదువుకు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు సంస్కరణల తిరోగమనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే విద్యా సంస్కరణలు తిరోగమనం పట్టాయి. నాడు-నేడులో నిర్మాణ దశలో ఉన్న భవనాలకు నిధులులేక వెలవెలలాడుతోన్నాయి. ఆయా స్కూళ్లవద్ద అదనపు తరగతి గదుల అసంపూర్తి నిర్మాణం దిష్టిబొమ్మల్ని తలపిస్తోందంటున్నారు. మరికొన్ని స్కూళ్లకు రంగుల, విద్యుత్, మంచినీటి సదుపాయం వంటివి సమకూర్చాల్సి ఉంది. సర్కారు బడులు కళావిహీనమవుతోన్నాయి. మే నెలలోనూ తల్లికి వందనం లేదు. ముగ్గురున్నా, ఐదుగురు న్నా ఇస్తామన్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ అందలేదు. విద్యా దీవెన, వసతి దీవెనలు రాలేదని వాపో తున్నారు. తరగతిగదుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నచందంగా ఉందని ఆరోపిస్తున్నారు.

“ అమ్మ ఒడి అందలేదు



అమ్మఒడి అందలేదు. మా పిల్లలు ఇద్దరికీ అమ్మ ఒడి వస్తుందని ఆశపడ్డాను. మే నెలలో ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వకపోవడం విచారకరం. ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్ మీడియంను కొనసాగిస్తే విద్యార్థులకు బాగుండేది. మా ఇంట్లో చేయూత పథకం నిలిచిపోయింది.

– మద్దిరాల మేరీ రాణి, సిద్దాపురం, ఆకివీడు మండలం

ఐటీఐలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సు(ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్) 45 రోజుల కాలవ్యవధి గల స్వల్పకాలిక కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన ఆసక్తి మహిళలు నేరుగా ఐటీఐని సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హత సర్టిఫికెట్స్, ఫోటో, ఈమెయిల్, ఫోన్ నంబర్ తీసుకుని వచ్చేనెల 9వ తేదీలోపుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈతర సమాచారం కొరకు 9676099988, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ 9492885556 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని శ్రీనివాసరాజు కోరారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగనుందని చైర్‌పర్సన్ జామి హైమావతి శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ సమావేశ హాలులో జరిగే సమావేశానికి కౌన్సిలర్లు అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. అజెండాలోని అంశాలతోపాటు, స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పొదుపు మీ భవిష్యత్ జీవితానికి మలుపు



కిశోర వికాసం కార్యక్రమంలో యువతులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి వాణీ విజయరత్నం

ఆకివీడు: కిశోర బాలికలు ఆర్థిక, సామాజిక స్థితిగతులతో ముందడుగు వేయాలని సీడీపీఓ ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయంలో వేసవి కాలం సందర్భంగా కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న యువతులు ఈ వయస్సులో తీసుకునే నిర్ణయాలు మీ భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఉద్యోగులు, చిరుద్యోగులూ అందరూ డబ్బును ఆదా చేయడం నేర్చుకోవాలన్నారు. దానిని తెలివిగా ఉపయోగించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి యువతీ పొదుపు ఖాతాను తెరవాలన్నారు. వారపు బడ్జెట్‌ను ఏర్పాటు చేసుకుని వినియోగానికి మార్గం ఏర్పరుచుకోవాలని వాణీ విజయరత్నం సూచించారు. మీ పొదుపు విషయాన్ని స్నేహితులు బంధువులకు తెలియజేసి వారి ద్వారా కూడా పొదుపు ఏర్పరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రత్నకుమారి, లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ లేని రాజ్యాధికారమే సీఐటీయూ లక్ష్యం



సీఐటీయూ జెండా ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: దోపిడీలేని కార్మిక వర్గ రాజ్యాధికారమే సీఐటీయూ లక్ష్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ఐక్యత పోరాటం నినాదంతో ఉద్యోగ, కార్మికుల పక్షపాతిగా పాలకవర్గాలు తెస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఎప్పటికప్పుడు తిప్పుకొడుతూ కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని సీఐటీయూ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం ఆంజనేయులు, ఎం వైకుంఠరావు, కె కోదండం , బి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



భీమవరంలో బాలలు బడికి రండి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాలు సదుపాయాలు, అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఆర్డీఓ కార్యాలయంలో బాలలు బడికి రండి పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈరోజుకూడా పిల్లలను బడిలో చేర్పించకపోవడం చాలా దారుణమన్నారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, మొగల్తూరు, కాళ్ల, ఉండి, ఆకివీడు తహసీల్దార్లు గ్రంధి పవన్‌కుమార్, దుర్గాకిషోర్, సుందర్‌సింగ్, నాగార్జున, వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేను



పళ్ళెం అరుణ కుమారి

ఆకివీడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనని మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు పళ్ళెం అరుణకుమారి చెప్పారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష ఎన్నిక గురువారం జరగడంతో పదవి నుంచి తప్పుకున్న సందర్భంగా ఆమె విలేకర్లతో శుక్రవారం మాట్లాడుతూ గ్రామ సంఘ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న తనను మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య, రాష్ట్ర సమాఖ్య డైరెక్టర్, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పదవులను ఇచ్చి సాధారణ గృహిణిగా ఉన్న నన్ను ఉన్నతస్థితికి తీసుకు వెళ్లారని చెప్పారు. కుగ్రామంలో ఉన్న తనను ఐదేళ్లలో రాష్ట్ర పదవుల్లో కూర్చోబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా ఏడాది పాటు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా పని చేశానని చెప్పారు. తాను ఈ స్థాయికి రావడానికి కారకులైన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, గోకరాజు రామరాజు, మండల, జిల్లా పార్టీ నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటానని అరుణకుమారి చెప్పారు. రానున్న రోజుల్లో జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జి సూచనల మేరకు వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

రామరాజుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం

భీమవరం(ప్రకాశం చౌక్): వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ గుంటూరు రామరాజు 2025 ఏడాది ఎన్టీఆర్ స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు డిస్ట్రిక్ట్ 201 క్యాబినెట్ సెక్రటరీ గాదిరాజు కృష్ణంరాజు, ట్రెజరర్ పాకలపాటి సీతారామరాజు, బులెటిన్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు, ఎడిటర్ భట్టిప్రోలు శ్రీనివాస రావు, జాలీవాకర్ గొట్టుముక్కల అప్పలరాజు తెలియజేశారు. ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 31వ తేదీన విజయవాడ పి బి సిద్ధార్థ కళాశాల కళావేదికలో ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రామరాజుకు అందజేస్తారని వారు తెలిపారు.

యోగా శిక్షణపై రిజిస్ట్రేషన్ చేసుకోండి

కాళ్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రా 2025 శిక్షణ కార్యక్రమానికి ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కాళ్ల ఎంపీడీవో జి.స్వాతి శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో యోగామాస్టర్ల చే యోగాపై శిక్షణ ఇస్తామన్నారు. అయితే నేర్చుకోవాలనుకునే వారు ముందుగా సంబంధిత సచివాలయంలో యోగ శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, నూతన వస్త్రాల పంపిణీ



భీమవరం వృద్ధాశ్రమంలో బియ్యం, నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణశివారు తాడేరురోడ్డులోని వృద్ధుల ఆశ్రమంలో బిఆర్ అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. యూత్‌ఫోర్స్ అధ్యక్షుడు గుంటి ప్రభు ఆధ్వర్యంలో నల్లి రత్నం రాజు, లిలియా గ్రేసీ సుమారు రూ.15వేలు విలువైన బియ్యం ప్యాకెట్లు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. నల్లి జీవన్‌రాజు, అంకిత, లిల్లీ గ్రేస్, స్నేహప్రియ, పిల్లి మునలయ్య, పిల్లి క్లేరా, సారిపల్లి కోటి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి సిద్ధం



విద్యాసామగ్రిని సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కాళ్ల: గత విద్యా సంవత్సరం చివరిలో సంబంధిత శాఖ వేసిన అంచనాలు ఆధారంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నామని కాళ్ళ ఎంఈఓ- 2 వేండ్ర వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా కోపల్లె స్టాక్ పాయింట్లో భద్రపర్చిన విద్యాసామగ్రిని సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ 60 పాఠశాలలు ఉన్నాయన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో తొలిరోజే సామగ్రిని అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొత్తం 4,421 విద్యార్థులున్నారన్నారు.

యోగ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): యోగ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుంచి యోగా రిజిస్ట్రేషన్స్, మాస్టర్ ట్రైనర్స్, ట్రైనర్స్ మ్యాపింగ్, యోగా పోటీలు, తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 21వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. జిల్లాకు10 లక్షల రిజిస్ట్రేషన్స్ లక్ష్యం కాగా నేటి వరకు 5,12,403 రిజిస్ట్రేషన్స్ మాత్రమే పూర్తి చేయడం జరిగిందన్నారు. కొన్ని మండలాలు రిజిస్ట్రేషన్‌లో బాగా వెనుకబడి ఉన్నాయని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో రిజిస్ట్రేషన్స్ వేగవంతం చేసి టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. యోగ సాధన ద్వారా కలిగే ఉపయోగాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జిల్లాలో అన్ని సచివాలయం పరిధిలో యోగా పోటీలను నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయంలో జరిగే యోగా కార్యక్రమాలు నాణ్యతతో ఉండాలన్నారు. ఫోటోలు లాగిన్ లో అప్డేట్ చేసి, సోషల్ మీడియాలో పెట్టాలని సూచించారు. యోగ కార్యక్రమంలో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో మొదటి వరసలో ఉండే విధంగా అధికారులందరు సమష్టి గా కృషి చేసి విజయవంతం చేయాలని కోరారు.

లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి



జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జూన్ 5తేదిన మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని అన్ని కోర్టుల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, సేవాసంస్థ చైర్మన్ బి లక్ష్మీ నారాయణ చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, గృహ హింస వంటి కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసు రాజీ పడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కాలాన్ని, వ్యయాన్ని ఆధా చేసుకోవచ్చునని జడ్జి తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలని జడ్జి లక్ష్మీనారాయణ కోరారు.

భీమవరంలో సీపీఎం సమైక్యత యాత్ర



సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత యాత్ర దృశ్యం

భీమవరం: అమాయక ప్రజలు ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోడానికి ప్రజలంతా ఏకం కావాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ అన్నారు. సీపీఎం దేశవ్యాపిత పిలుపులో భాగంగా సమైక్యత యాత్ర భీమవరంలో శుక్రవారం బస్టాండ్ దగ్గర నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి అందరూ సంఘీభావం తెలిపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనసాగించలేకపోయిందన్నారు. అమెరికా జోక్యంతో ఆపివేయడం సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదుల దాడులకు గురైన బాధితులను ఆదుకోవడం, పరామర్శించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని, భారత ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించాలని సీతారామ్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, డి త్రిమూర్తులు, కలిపిండి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గొడుగు వెంకటేశ్వరరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తీస్తున్నారా? లేక కాలువ పూడ్చేస్తున్నారా!



కలిసిపూడి, చెరుకువాడ మధ్యలో పూడికతీత అనంతరం కాలువగట్టు విరిగి జారిపోతున్న దృశ్యాలు

ఉండి: ఎవరు చెప్పినా, ఏం చెప్పినా మేమింతే అన్నట్లు ఉన్నాయి. ఉండి కాలువ పూడి కతీత పనులు. ఒకవైపు ఇష్టానుసారం చేస్తున్న పనులలో నాణ్యత ఎక్కడా లేకపోగా కాలువలో లోతుగా నీరుండటగానే ప్రొక్లెయిన్ సహాయంతో తూతూ మంత్రంగా కాలువ నుంచి మట్టిని తొలగిస్తున్నారు. సీసీరోడ్లు, కాలువగట్టు, జాతీయరహదారిపై ఇప్పటికే గుట్టలు గుట్టలుగా మట్టిని వేసేసారు. రైతులు ప్రజలకు కనీసం నడిచేందుకు కూడా దారి లేకుండా చేశారు. దీంతో ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. కాలువలో పూడికతీత పనులు ఎలా అంటే అలా చేస్తున్న కారణంగా కాలువగట్లు విరిగి జారిపోతున్నాయి. కాలువలో మట్టితీస్తున్నామని చెప్పేందుకు గట్లవారిగా మట్టిని తీసి పైన వేయడంతో మంచిగా ఉండే కాలువగట్లు కాస్త విరిగిపోయి కాలువలోకి జారిపోతున్నాయి. దీంతో రూ.22 లక్షల రూపాయల అంచానాలతో కలిసిపూడి రెగ్యులేటర్ నుంచి కాలువ శివారు అజ్జమూరు సరిహద్దు వరకు జరుగుతున్న పూడికతీత పనులపై రైతులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. అయినా అధికారుల తీరు మాత్రం మారడం లేదు. జరుగుతున్న పనుల వద్ద క్రిందిస్థాయి సిబ్బందిని ఉంచి వారు మాత్రం కార్యాలయాలకు, ఇతర ప్రాంతాలకు పరిమితమవుతున్నారు.ఇలా అయితే ఇప్పటికే తూతూ మంత్రంగా జరుగుతున్న కాలువ పూడికతీత పనులతో వచ్చే సీజన్‌లో వరికి సాగునీరందించగలరా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సాగునీటి ఇబ్బందులు తలెత్తే కలసిపూడి, చెరుకువాడ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళిక లేకుండా చేపట్టిన కాలువ పూడికతీత పనుల ద్వారా ఒకవైపు వాంద్రం కాలువ పూడ్చేస్తున్నా, ఉండి కాలువ ఇష్టానుసారం పనులు నిర్వహిస్తున్నా అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది.